క్లుప్తంగా...

బీసీ సంక్షేమానికి ప్రాధాన్యం



సాక్షి, మేడ్చల్ జిల్లా: బీసీ కుల,చేతి వృత్తి దారుల అభ్యున్నతికి, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, అందులో భాగంగా రూ. లక్ష పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్యతో కలిసి బీసీ కుల వృత్తి దారులకు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ ,అభివృద్ధి పథకాలను తెలంగాణలో ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి కేశూరామ్, లబ్ధిదారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నలుగురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- వారి స్థానంలో కొత్త వారికి పోస్టింగ్‌లు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని నాగారం, పోచారం, దమ్మాయిగూడ, ఘట్కేసర్ పురపాలక సంఘాల కమిషనర్లను బదిలీ చేస్తూ...శనివారం ప్రభుత్వ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న పి.వేమన్‌రెడ్డిని పోచారం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎండీ. సాబీర్‌అలీని ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. పోచారం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఏ.సురేష్‌ను గ్రేటర్ హైదరాబాద్ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. నాగారం మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఏ.వాణి రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కాగా, ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న జి.రాజేందర్‌కుమార్‌ను నాగారం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ పని చేస్తున్న ఏ.స్వామిని పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఎస్.రాజమల్లయ్యను దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

'హైకోర్టు తీర్పును అమలు చేయాలి'

కాచిగూడ: ప్రభుత్వ అధికారులు, పాలక, ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు కొందరు భూ కబ్జాదారులతో కుమ్మక్కై బొమ్మరాసి పేట గ్రామంలో తమ కుటుంబ సభ్యులు, బంధువులకు చెందిన 1049 ఎకరాల భూమికి దొంగపత్రాలు సృష్టించి కబ్జా చేశారని భూమి హక్కుదారుడు, మాజీ ఎంపీ స్వర్గీయ బలరామకృష్ణయ్య (గుడివాడ) మనుమడు దుగ్గిరాల యుగంధర్ బాబు ఆరోపించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్, న్యాయవాదులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ చంద్రశేఖర్, రాములతో కలిసి ఆయన మాట్లాడారు బొమ్మరాసిపేట భూములపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాదారులు కొందరు రైతు సంక్షేమ సంఘం పేరుతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి సమస్యను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారికి బీఆర్ఎస్ నేతలు, మంత్రి, కాంగ్రెస్, బీజేపీ నేతలు సహకరిస్తున్నారని ఆరోపించారు. భూ కబ్జాదారులకు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. కోర్టులు, చట్టాలపై ఆయనకు గౌరవం ఉంటే తమవద్ద ఉన్న డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు చూసి న్యాయం వైపు ఉంటారో అన్యాయాన్ని సమర్థిస్తారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మేడ్చల్ నుండి తూప్రాన్ వైపు బైక్‌పై వెళుతుండగా అత్వెల్లి సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రాకేశ్ ఎగిరి మేడ్చల్ వైపు వెళ్లే రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో మేడ్చల్ వైపు వస్తున్న గుర్తు తెలియని కారు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీరాజ్ శాఖ టార్గెట్ రూ. 26.24 కోట్లు



మండలాల వారీగా పన్నుల వసూళ్ల వివరాలు ఇవీ..

మండలం	పన్నుల లక్ష్యం (రూ.కోట్లల్లో) (2022–23)	పన్నుల వసూళ్లు (రూ.కోట్లల్లో) (2022–23)	పన్నుల లక్ష్యం (రూ.కోట్లల్లో) (2023–24)
కీసర	3.01	2.93	3.29
ఘట్కేసర్	7.00	6.59	7.60
మేడ్చల్	6.95	6.61	7.28
శామీర్‌పేట్	3.88	3.67	4.18
ఎంసీపల్లి	1.99	1.92	3.88
మొత్తం	రూ. 22.85 కోట్లు	రూ. 21.73 కోట్లు	రూ.26.24 కోట్లు

గతేడాది లక్ష్యం రూ.22.85 కోట్లు వసూలైంది రూ.21.73 కోట్లు

- ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.4 కోట్ల పన్నుల వసూలుకు నిర్ణయం
- మూడు నెలల్లో 15 శాతం పన్నులు వసూలు చేసిన జీపీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పంచాయతీరాజ్ శాఖ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నుల ద్వారా రూ.26.24 కోట్లు వసూలు లక్ష్యంగా నిర్ణయించింది. గతేడాది కంటే.. ఈ ఆర్థిక సంవత్సరంలో అదనంగా పన్నుల ద్వారా రూ.4 కోట్లు రాబట్టాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మూడు నెలల వ్యవధిలోనే జిల్లా పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో వివిధ పన్నులకు సంబంధించి 15 శాతం వసూలయ్యాయి. లక్ష్యానికి అనుగుణంగా నెల వారీ పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించేందుకు జిల్లా పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కీసర మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.3.29 కోట్ల పన్నులు వసూలు చేయాలని నిర్ణయించారు. మేడ్చల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో రూ.7.28 కోట్లు, ఘట్కేసర్ మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో రూ.7.60 కోట్లు, మూడు చింతలపల్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో రూ.3.88 కోట్లు, శామీర్‌పేట్ మండల పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ. 4.18 కోట్లు పన్నుల ద్వారా వసూలు చేసేందుకు టార్గెట్‌గా నిర్ణయించారు. గ్రామాల్లోని పంచాయతీ పాలక వర్గం, సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పన్నులు వసూలు చేయాలని డీపీఓ వర్గాలు ఆదేశాలు జారీ చేశాయి.

గతేడాదిలో రూ.21.73 కోట్లే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 61 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ పన్నుల వసూళ్ల ద్వారా రూ.22.85 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ, ఇప్పటి వరకు రూ.21.73 కోట్లు వసూలయ్యాయి. మిగతా పన్నుల సొమ్ము రూ.1.14 కోట్లు సకాలంలో వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఘట్కేసర్ మండలంలో 94.20 శాతం, కీసర మండలంలో 97.19 శాతం, మేడ్చల్ మండలంలో 95.10 శాతం , మూడుచింతలపల్లి మండలంలో 95.25 శాతం, శామీర్‌పేట మండలంలో 94.65 శాతం పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో మొత్తంగా 61 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ రకాల పన్నుల ద్వారా 95.12 శాతం వసూలయ్యాయి.

కార్మికుల పిల్లల బాధ్యత పరిశ్రమలదే



దే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్

శామీర్‌పేట్: పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లల బాధ్యత పరిశ్రమల యాజమాన్యాలదేనని ఇండస్ట్రీస్, కామర్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. హైదరాబాద్, జినోమ్‌వ్యాలీలో కోవే (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా), యూనిక్ బయోటెక్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ పనిచేస్తున్న వారి పిల్లల బాధ్యత పరిశ్రమలే చూసుకోవాలని టీఎస్ఐపీసీ చట్టం స్పష్టం చేస్తుందన్నారు. జినోమ్ వ్యాలీ ఫేస్ 2 లోని పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళల పిల్లల సౌకర్యార్థం డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఉండే చిన్నారులకు పౌష్టికాహారం అందజేసేందుకు స్థానిక పరిశ్రమలు సహకారం అందించాలని సూచించారు. డే కేర్ సెంటర్‌లోని సౌకర్యాలతో కూడిన పూర్తి వివరాలతో జినోమ్ వ్యాలీలోని అన్ని పరిశ్రమల గేట్ ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అల్పాదాయ ఉద్యోగులు, పరిశ్రమల్లో పనిచేసే మహిళల పిల్లల సౌకర్యార్థం అపేక్ష డే కేర్ సెంటర్ ప్రారంభించడం జరిగిందని, హైదరాబాద్‌లో ఇప్పటికే జీడిమెట్ల, చర్లపల్లి, ఉప్పల్, మౌలాలీ, పాశమైలారం లో ఈ డే కేర్ సెంటర్లు కొనసాగుతున్నట్లు కోవె నేషనల్ ప్రెసిడెంట్ లలిత పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ఐపీసీ వైస్ చైర్మన్, ఎండి నర్సింహారెడ్డి, సిడ్జి జనరల్ మేనేజర్ హిందూషు అస్థానా, యూనిక్ బయోటెక్ ఎండీ రత్నసుధ, పలు కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కీసర ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న, సింగారెడ్డి శౌరిరెడ్డి తదితరులు

కీసర: బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. శనివారం కీసర ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సౌకర్యార్థం అమేజాన్ లెర్నింగ్ లింక్స్ ఇండియా సహకారంతో 15 కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా సుమారు 550 ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతోపాటు, విద్యార్థులు, తల్లిదండ్రులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లుగా డిజిటల్ తరగతులు, సాంకేతిక బోధన, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటు పడుతుం. కీసర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్ టీచర్‌ను కూడా నియమించినట్లు తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన అమేజాన్ లెర్నింగ్‌లింక్స్ ఇండియా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బాలవికాస ఐటీ మేనేజర్ శివరాం, కీసర గ్రామ సర్పంచ్ నాయకపు మాధురి, విద్యా కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాంపల్లి దాయర, గోధుమకుంట గ్రామాల్లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలకు స్వయం ఉపాధిలో భాగంగా అభయ ఫౌండేషన్ సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సుమారు 3 నెలల పాటు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇప్పించి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. అనంతరం కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సరిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం గోధుమకుంట గ్రామంలో సుమారు 13 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు చామకూర భద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బెస్తవెంకటేష్, సర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, గరుగుల అండాలు మల్లేష్, నాయకపు మాధురి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచులు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ సుజాత, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, అభయ ఫౌండేషన్ అధికారులు , బీఆర్ఎస్ మండల పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు అందజేస్తుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం ఆయన కొర్రెముల్ గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైతే సొంత నిధులు వెచ్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణారెడ్డి, సర్పంచులు శివశంకర్, వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, ఎంపీటీసీ వినోద, వార్డు సభ్యులు దుర్గరాజ్, ఆంజనేయులు, లక్ష్మి, భాస్కర్, బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ భద్రారెడ్డి, మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, సత్యనారాయణముదిరాజ్ పాల్గొన్నారు.

అడ్డంకులు..అరెస్టులు

- కలెక్టరేట్ ఎదుట బొమ్మరాసి పేట రైతుల ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు.. పలువురి అరెస్ట్



సాక్షి, మేడ్చల్ జిల్లా: తమకు న్యాయం చేయాలని కోరుతూ.. శనివారం బొమ్మరాసిపేట రైతులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అందోళనలో పాల్గొనేందుకు వచ్చిన పలువురు రైతులు, మహిళలను పోలీసులు అరెస్ట్ చేసి శామీర్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బొమ్మరాసిపేట గ్రామంలోని సర్వే నంబర్లు 323 నుంచి 409 వరకు ఉన్న భూముల్లో ఎటువంటి లావాదేవీలు జరపకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, స్లాట్ బుకింగ్‌కు రెవెన్యూ అధికారులు అవకాశం కల్పించారని రైతులు ఆరోపించారు. కలెక్టరేట్‌కు తరలివస్తున్న రైతులను పోలీసులు అడ్డుకోవటంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కలెక్టరేట్‌లో జిల్లా మంత్రి మల్లారెడ్డి అధికారిక కార్యక్రమం ఉన్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులను కలెక్టరేట్‌లోకి అనుమతించకుండా అదుపులోకి తీసుకున్నారు.

రూ. 6.5 లక్షల సొంత నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



కీసర: రాంపల్లి దాయర గ్రామ పంచాయతీ పరిధిలోని జెఎన్ఎంయూఆర్ కాలనీలో ప్రజల విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ 1వ వార్డు సభ్యుడు కందాడి శ్రీకాంత్‌రెడ్డి రూ. 6.5లక్షల సొంత నిధులతో కాలనీలో సీసీ రోడ్డు పనులు చేపట్టాడు. శనివారం ఉదయం పనులు ప్రారంభించి సాయంత్రం లోగా పూర్తి చేయించడం గమనార్హం. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జెఎన్ఎంయూఆర్ కాలనీ వాసులకు ఇచ్చిన మాట ప్రకారం సొంత నిధులతో కాలనీలో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపాడు. ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు తాను ముందుంటానన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కందాడి శ్రీకాంత్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కీసరగుట్ట ట్రస్టుబోర్డు సభ్యుడు కందాడి వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కందాడి శ్రీనివాస్‌రెడ్డి, వార్డుసభ్యులు చంద్రకళ, విజయ, ముక్క మహేందర్, నేతలు కొకుట్ల శ్రీకాంత్‌రెడ్డి, చందు, ఆంజనేయులు, కనకయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



టెక్నాలజీపై పట్టు సాధించాలి



విద్యార్థినికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న జేఎన్‌టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు టెక్నాలజీపై పట్టు సాధించాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం టెక్నాలజీలో దూసుకుపోతోందని ఇంజినీరింగ్ విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులు అంతటితో ఆగకుండా మరింత ముందుకు సాగే ప్రయత్నం చేయాలని ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. అంతకుముందు జేఎన్‌టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా సమాజంలో సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలకు వినూత్నమైన ఆలోచనలతో పరిష్కారాలు చూపాలని, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ బహుకరించారు. విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీశైలంరెడ్డి, భూపాల్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు

కీసర: మేడ్చల్ జిల్లా పరిధిలోని వివిధ మండలాల్లో ఆయిల్ పామ్ సాగుచేసేందుకు ముందుకు వచ్చే రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేయనున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి కె. నిరజగాంధీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 1.54 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్ పామ్ డెవలప్‌మెంట్ స్కీమ్ అన్ని జిల్లాల్లో అమలులోకి వచ్చిందన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 10,000 ఎకరాల్లో సాగుకు అనువుగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు పంట సాగు చేసే రైతులకు సబ్సిడీపై సేద్య, డ్రిప్ పరికరాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈనెల 17 నుంచి దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి కె. నీరజ గాంధీ(7997725259), ఉద్యాన అధికారి కె. రేణుక(7997725269)ను సంప్రదించాలని సూచించారు.

'మేడ్చల్ నుంచే పోటీ చేస్తా'



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

మేడ్చల్ రూరల్: వచ్చే ఎన్నికల్లో తాను మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నట్లు తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. శనివారం ఆయన మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ దుస్థితిని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడే బయట పెట్టాడని ఇంతకుమించిన సాక్ష్యం ఇంకేం ఉండదన్నారు. ప్రభు త్వ పాఠశాలలను రక్షించుకుని, పేద విద్యార్థులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వ వ్యవస్థలను భ్రష్టు పట్టించాయని అందుకే తాము ప్రైవేటు విద్యా వర్సెస్ ప్రభుత్వ విద్య నినాదంతో పోరాటం చేస్తున్నామన్నారు. మూడేళ్లలో నియోజకవర్గంలోని పాఠశాలలను ప్రథమ స్థానంలో నిలిచేలా తీర్చిదిద్దుతామన్నారు.

ఇకపై మేడ్చల్‌లో యుద్ధమే..

ఇకపై మేడ్చల్ నియోజకవర్గంలో యుద్ధం జరుగుతుందని తీన్మార్ మల్లన్న అన్నారు. కొందరు నాయకులు రోడ్లపైకి వచ్చి నువ్వానేనా అని సవాళ్లు విసురుతున్నారని, అతయితే తన సవాళ్లు విద్య, వైద్యం, సత్వర న్యాయం, రైతు సమస్యలపై మాత్రమేనన్నారు. నియోజకవర్గ ప్రజలకు త్వరలోనే మంచి రోజులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా కొందరు విలేకరులు మేడ్చల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారా అని ప్రశ్నించగా తప్పకుండా పోటీలో ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయాలని కోరుతున్నారని, అయితే తాను స్వతంత్రంగా బరిలో దిగుతానని మీ అభ్యర్థిని పెట్టకుండా చూసుకోవాలని సూచించానన్నారు. బీజేపీ పార్టీ సైతం అభ్యర్థిని నిలబెట్టరాదన్నారు. తీన్మార్ మల్లన్న ఒక్కడే 10 ఏళ్లుగా కేసీఆర్‌ను ఎదుర్కొంటున్నాడని, ప్రభుత్వం తనపై పెట్టినన్ని కేసులు రాష్ట్రంలో ఇంకెవ్వరిపై పెట్టలేదన్నారు. 65 కేసులు పెట్టారని తాను పోటీ చేసేందుకు ఇంతకుమించిన అర్హత ఏముంటుందన్నారు.

గ్రూప్–4 పరీక్షలో అర్హత సాధించలేనని..

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్: రైలుకు ఎదురుగా నిలబడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం సాయంత్రం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా, బిక్కూరు గ్రామానికి చెందిన కొట్టం సంతోశ్‌కుమార్ (23) మేడిపల్లి మండలంలో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ నెల 1న గ్రూప్–4 పరీక్ష రాశాడు. ఇటీవల విడుదలైన కీ పేపర్‌ను పరిశీలించగా తాను అర్హత సాధించలేనని మనస్తాపంతో శనివారం ఎన్ఎఫ్‌సీనగర్ ప్రాంతంలో సికింద్రాబాద్–థానా రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పో లీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రాచకొండ భద్రతా మండలి వార్షిక సమావేశం

పోచారం: రాచకొండ భద్రతా మండలి తృతీయ వార్షిక సర్వసభ్య సమావేశం ఇన్ఫోసిస్ పోచారం క్యాంపస్‌లో శనివారం జరిగింది. సీపీ డీఎస్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దాదాపు 60 మంది అధికారులు పాల్గొన్నారు. 2022–23 వార్షిక నివేదికను చైర్మన్, జాయింట్ కమిషనర్ సత్యనారాయణ సమక్షంలో వైస్ చైర్మన్ వెంకటేశ్, జనరల్ సెక్రటరీ సతీష్ వడ్లమూడి, కోశాధికారి గంగదీప్ కోహ్లి విడుదల చేశారు. కార్యక్రమానికి డీసీపీలు కన్వీనర్‌లుగా వ్యవహరించారు. భద్రతా మండలిలో మరిన్ని కంపెనీలు చేరాలని చైర్మన్ ఈ సందర్భంగా కోరారు.

బోనాల జాతర ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో పరిధిలో ఆదివారం జరగనున్న బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు నాగారం మున్సిపల్‌పాలవకర్గంతో పాటు, పోలీసులకు సహకరించాలని నాగారంమున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారంలో బోనాల ఉత్సవాల సందర్భంగా శనివారం పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బోనాల ఉత్సవాలు నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పలు ఆలయాల వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో విద్యుద్దీపాలు, మంచినీటి సౌకర్యం, శానిటేషన్ పనులు, చేపట్టినట్లు తెలిపారు . ఎస్.ఐ నాగరాజు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారిమల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు సుర్వీ శ్రీనివాస్‌గౌడ్, కొకుట్ల అనంతరెడ్డి, మమత కృష్ణారెడ్డి, బిజ్జశ్రీనివాస్‌గౌడ్, అన్నం రాజు లావణ్య శ్రీనివాస్, నేతలు వివిధ కాలనీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.